క్లుప్తంగా

పంచాయతీకి టీడీ బకాయిలు చెల్లించాలి

వేంపల్లె : వేంపల్లె గ్రామ పంచాయతీకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వచ్చే ట్రాన్స్‌ఫర్ డ్యూటీ బకాయిలను వెంటనే చెల్లించాలని పంచాయతీ ఈఓ రవిశంకర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ఏడాది జూన్ నుంచి పంచాయతీకి సంబంధించి దాదాపు రూ.60 లక్షలకుపైగా ట్రాన్స్‌ఫర్ డ్యూటీ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని.. దీంతో గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఆటంకం కలుగుతోందన్నారు. ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ విషయంపై వేంపల్లె సబ్ రిజిస్ట్రార్ హరికృష్ణను వివరణ కోరగా.. గ్రామ పంచాయతీకి సంబంధించి ప్రతినెలా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి రిపోర్ట్ పంపుతున్నామని.. అక్కడ నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే ట్రాన్స్‌ఫర్ డ్యూటీ బకాయిలు చెల్లిస్తామని తెలిపారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ వితరణ



దివ్యాంగుడు హరిప్రసాద్‌కు వీల్‌చైర్‌ను అందిస్తున్న సురేష్‌బాబు, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలో నివసిస్తున్న దివ్యాంగుడు దిద్దేకుంట హరిప్రసాద్‌కు ఆదివారం మాజీ సైనికోద్యోగి సురేష్‌బాబు వీల్ చైర్‌ను వితరణగా అందించారు. దివ్యాంగుడు హరిప్రసాద్ రోడ్డు ప్రమాదంలో వెన్నుముక దెబ్బతిని గత కొన్నేళ్లుగా రెండు కాళ్లు పనిచేయక మంచానికే పరిమితమైన విషయాన్ని గమనించి వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి యురేనియం ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ బి.సుగుణాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన మిత్రుడు ఇప్పట్లకు చెందిన మాజీ సైనికో ఉద్యోగి సురేష్‌బాబు సహకారంతో దివ్యాంగుడు హరిప్రసాద్‌కు వీల్ చైర్‌ను అందించారు.

అనాథలకు అన్నదానం



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

లింగాల : స్థానికంగా ఉన్న దీనబందు అనాథ ఆశ్రమంలో ఆదివారం పులివెందుల పట్టణం వైఎస్ రాజారెడ్డి ఆసుపత్రిలో నిర్వాహకుడిగా పనిచేస్తున్న శ్రీనివాసులరెడ్డి కుమారుడు జయ భరత్‌రెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ స్పెషల్ కోర్సుల్లో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్: హెలెన్ కెల్లర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో బిఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుకు ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ దౌలత్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరదలచిన వారు బ్యాచిలర్ డిగ్రీ లేక మాస్టర్ డిగ్రీలో సైన్సు, సోసియల్ స్టడీస్, హ్యూమానిటీస్‌లో ఓసీలు 50 శాతం మార్కులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలు 45 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ లేక టెక్నాలజీలో సైన్సు, మ్యాథమాటిక్స్‌ల స్పెషలైజేషన్ కలిసి 55 శాతం మార్కులు కలిగి ఉండాలని లేక దీనికి సమానమైన ఏదైనా విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సులో చేరుటకు అర్హులన్నారు. వివరాలకు 99660 06758 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ కడప రీజనల్ పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులపతి, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి కోరారు. పాఠశాల విద్య ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టిన వెంకట క్రిష్టారెడ్డిని ఆదివారం వారు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప రీజనల్ పరిధిలోని 8 జిల్లాల విద్యాశాఖ అధికారి కార్యాలయాల్లో పెండింగ్ ఎంక్వయిరీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రాజమోహన్‌రెడ్డి, వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు ఐసి విశ్వనాథరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చౌదరి పాల్గొన్నారు.

ప్రచారం కోసమే తనిఖీలు

కడప ఎడ్యుకేషన్: విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల తనిఖీ కార్యక్రమం కేవలం ప్రచారం కోసమే చేస్తున్నట్లు స్పష్టమవుతోందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. విద్యా సంవత్సరం ముగుస్తున్న సమయంలో ఈ తనిఖీలేంటని ప్రశ్నించారు. తనిఖీల సమయంలో ఉపాధ్యాయులు, అధికారులకు తగిన సూచనలిచ్చి ప్రోత్సహించాల్సింది పోయి అధికార దర్పంతో సస్పెండ్ చేయడమేమిటన్నారు.

కల్యాణం.. కమనీయం...



కల్యాణ వేదికపై ఆశీనులైన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

కమలాపురం : మండల పరిధిలోని సంబటూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వాముల వారి కల్యాణం కమనీయంగా జరిగింది. లక్ష్మీచెన్నకేశవస్వామి వారి 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. అశేష భక్త జనసందోహం నడుమ వేద పండితుల మంత్రోచ్చారణలతో స్వామి వార్ల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. అంతకు ముందు సుప్రభాత సేవ, పంచామృతాభి షేకములు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తులందరికి నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలోని పుర వీధుల గుండా స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన స్వామి వారి ఉయ్యాల సేవను వీక్షించేందుకు భక్తులు ఆసక్తి చూపారు. చెక్క భజన భక్తులను విశేషంగా అలరించింది.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మిచెన్నకేశవస్వామి

ఘనంగా బండలాగుడుపోటీలు

సంబటూరులో వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బండ లాగుడు పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 12 జతల కాండ్లు పోటీలో తలపడ్డాయి. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.30,016, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతులను దాతల ద్వారా అందజేశారు.

నేడు నిరుద్యోగ మహిళలకు ఇంటర్వ్యూలు

కమలాపురం : నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించడం కోసం సోమవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండేళ్లుగా ఎమ్మెల్యే గడప గడపకు తిరుగుతున్న సమయంలో అధికశాతం మంది మహిళలు తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన పారిశ్రామికవాడ కొప్పర్తిలో నూతనంగా నెలకొల్పబడిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ అయిన ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో నిరుద్యోగ మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. సీకేదిన్నె మండలం, రోడ్డు కృష్ణాపురం వద్ద ఉన్న స్విస్ట్ కళాశాల నందు 24వ తేదీన ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సీసీ కెమెరాల తయారీ విభాగంలో ఉద్యోగ అవకాశం ఉంటుందని, టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీ.టెక్. చదివిన మహిళలు, పురుషులు సైతం ఈ ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. 19–32 సంవత్సరాల వారు అర్హులని, రూ.11 వేల నుంచి రూ.16వేల వరకు జీతం ఉంటుందని, అటెండెన్స్ బోనస్ రూ.1000తో పాటు భోజనం, బస్సు ఉచితంగా ఇస్తామన్నారు. అలాగే పీఎఫ్ అండ్ ఈఎస్ఐ కూడా వర్తిస్తాయన్నారు. ఇంటర్వ్యూలకు వచ్చే నిరుద్యోగలు తమ వెంట ఆధార్ కార్డు, మార్క్‌లిస్ట్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలు తీసుకురావాలని, పూర్తి వివరాలకు 63096 37805, 76719 31665 నెంబర్లకు సంప్రదించాలని వారు తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వీరపునాయునిపల్లె : మండలంలోని ఇందుకూరు, కొత్తపల్లె, గడ్డంవారిపల్లె, అయ్యవారిపల్లె గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవండి

వేముల : వచ్చే ఎన్నికలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి కోరారు. ఆదివారం వేములలోని ఇందిరమ్మ కాలనీ, ముస్లిం బజార్, బస్టాండు సమీపంలోని నూతన కాలనీల్లో మా నమ్మకం నువ్వే జగన్–జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా కాలనీల్లో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులనుంచి జగనన్న పాలనలో అన్ని సంక్షేమ ఫలాలు అందుతున్నాయని.. జగన్‌కు అండగా ఉంటామని అన్ని వర్గాల ప్రజలు చెబుతున్నారన్నారు. ప్రతి ఇంటికి స్టిక్కర్లను అతికిస్తూ నిర్దేశించిన మొబైల్ నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు. సమస్యలను అడిగి తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, డీసీసీ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ రాధాకృష్ణయ్య, రామసుబ్బారెడ్డి, బస్సు సుబ్బారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మండి మా పీరా, చలపతి, గంగిరెడ్డి, నారాయణస్వామి, ముస్లిం మైనార్టీ నాయకులు గౌస్ పీరా, బాషా, జర్మియ, గంగులయ్య, శ్రీనివాసులు, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు బ్రోచర్‌ను అందిస్తున్న మండల ఇన్‌చార్జి, తదితరులు

నిరుపేద ముస్లిం పిల్లలకు ఉచిత వడుగులు

జమ్మలమడుగు : నియోజకవర్గంలోని నిరుపేద ముస్లిం బాలురకు ఉచితంగా వడుగులు ఆస్థానయే గౌసియా ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ, ప్రభుత్వ గెజిటెడ్ ఖాజీ సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ తెలిపారు. ఆదివారం స్థానిక పెద్ద మకాన్‌లో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలోని నిరుపేదల ముస్లిం బాలురు వడుగులు చేయించుకోవాలన్న తల్లిదండ్రులు మే 5వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ముద్దనూరు, ఎర్రగుంట్ల, కొండాపురం మండలాలకు సంబంధించిన వారు ముద్దనూరులోని నిజాముద్దీన్ అవులియా ఖాద్రీ వద్ద 9492407867, మైలవరం, జమ్మలమడుగు, పెద్దముడియం మండలాలోని వారు ఆస్తానయే గౌసియాకు సంబంధించిన 9440923027 నంబర్‌కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వడుగులు చేయించుకున్న వారికి ఉచితంగా మందులతోపాటు, జత బట్టలు, ఐదు కేజిల గోధుమ పిండి, కేజీ చెక్కెర, అరకేజి నెయ్యి, కొబ్బర, బెల్లంతోపాటు వంద రూపాయలు చార్జీలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుపేదలైన ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు



శాస్త్రీయ నృత్యంలో చిన్నారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శిల్పారామంలో ఆదివారం బావర్చి రెస్టారెంట్ సౌజన్యంతో యువరాజా డ్యాన్సింగ్ స్కూలు చిన్నారుల నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. డ్యాన్స్ మాస్టర్ టి.యువ కిశోర్ ఆధ్వర్యంలో చిన్నారులు జానపద, శాస్త్రీయ పాటలకు నృత్యాలు చేశారు. తదితర పాటలకు చిన్నారుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో శిల్పారామ ఏఓ సుధాకర్, సేవా సమితి అధ్యక్షుడు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు

వేంపల్లె : ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపును మూడేళ్ల నుంచి 8 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం జీవో 38 విడుదల చేయడంపై కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షుడు బీఎస్ రమణారెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్, ఎస్సీ ఈఆర్టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జీవో విడుదల కావడానికి కృషి చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, ఎం.వి.రామచంద్రారెడ్డి, పి.చంద్రశేఖర రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేట్ పాఠశాలలు కూడా కృషి చేస్తున్నాయని.. ప్రైవేట్ పాఠశాలల సమస్యలపట్ల ప్రభుత్వం సానుకూల దోరణితో వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



పూజలందుకుంటున్న పెద్దమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. పోతురాజు వద్ద ముద్దలను ఏర్పాటు చేసి జంతుబళులు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో విందుభోజనాలను ఆరగించారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా పెద్దమ్మతల్లికి పూజలు

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని కోవెలకుంట్ల రోడ్డులో వెలసిన పోలిమెర పెద్దమ్మ తల్లికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఏప్రిల్ 8, 9 తేదీల్లో గ్రామ దేవత పెద్దమ్మ తల్లికి ఘనంగా దేవర నిర్వహించారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి దేవర మహోత్సవంలో భాగంగా గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. దేవర చేసిన 16 రోజులు అయిన సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

టీచర్ల బదిలీలు నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత బదిలీల కోడ్‌తో టీచర్ల బదిలీలను నిర్వహించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రావన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జిల్లాశాఖ కార్యనిర్వాహక వర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు, అధికారులు మారినప్పుడల్లా రకరకాల విధి విధానాలతో టీచర్ల బదిలీ మార్గదర్శకాలు విడుదల చేయడం జరుగుతోందన్నారు. వాటిపై టీచర్లు కోర్టు మెట్లు ఎక్కడంతో బదిలీలు నిర్వహించడంలో అనేక అవరోధాలు ఏర్పడుతున్నాయన్నారు. అందువల్ల ఆపస్ ఎప్పటినుంచో కోరుతున్న విధంగా టీచర్లకు శాశ్వత బదిలీల కోడ్ రూపొందించి వేసవి సెలవుల్లోనే బదిలీలు నిర్వహించాలన్నారు. ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు రామమోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, జిల్లా సహాధ్యక్షుడు రెడ్డయ్యరెడ్డి, నారాయణరెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, చంద్రమోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సిరులు కురిపించనున్న.. నువ్వుల పంట

పులివెందుల రూరల్ : ఈ ఏడాది రబీలో సాగు చేసిన నువ్వుల పంట రైతుల ఇంట సిరులు కురిపిస్తోంది. ప్రస్తుతం నువ్వుల ధరలు కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. క్వింటా ధర రూ.16వేల నుంచి రూ.18వేల వరకు పలుకుతుందని రైతులు అంటున్నారు. ఈ నువ్వుల పంటనే ఉష్ణ పంటగా పిలుస్తారు. ప్రతి ఏడాది వేసవిలో నువ్వుల పంటలు సాగు వాతావరణం అనుకూలించక నష్టపోతున్నట్లు రైతులు తెలిపారు. పులివెందుల మండల వ్యాప్తంగా 1200 హెక్టార్లలో పంట సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది నువ్వుల పంట విస్తీర్ణం పెరిగినట్లు వారు తెలిపారు. పంట దిగుబడి రావాలంటే కనీసం మూడు నెలలు పడుతుందని రైతులు అంటున్నారు. ఈ ఏడాది రబీలో సాగు చేసిన నువ్వుల పంట ఆశాజనకంగా ఉన్నట్లు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



సాగులో ఉన్న నువ్వుల పంట

శ్రీ లక్ష్మినరసింహునికి చందనోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం బ్రాహ్మణవీధిలోని శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంలో ఆదివారం చందనోత్సవం నిర్వహించారు. అక్షయ తృతీయ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకమైన వెండి పీఠంపై శ్రీ లక్ష్మి నరసింహస్వామి, శ్రీ ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. ఆ ప్రాంగణంలోని బృందవనాన్ని ప్రత్యేకంగా సేకరించిన తేనెతో అభిషేకించి, చందనంతో అలంకరించి ద్రాక్ష, ఆపిల్ పండ్లతో ప్రత్యేక అలంకారం చేశారు. చామంతి పూలు, తులసి దళాలతో కర్పూర హారతి ఇచ్చారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ లక్ష్మి నరసింహస్వామి, ఆంజనేయస్వామితోపాటు శ్రీ గురురాఘవేంద్రస్వామి బృందావనాన్ని దర్శించుకున్నారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

సింహాద్రిపురం : మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి సతీమణి, మాజీ సర్పంచ్ దివంగత సరస్వతమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి అనంతపురం కిమ్స్ సవేరా ఆసుపత్రికి చెందిన వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గుండె, కంటికి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి భోజన వసతి కల్పించారు.



ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చేతివృత్తిదారుల సంక్షేమానికి కృషి

కడప వైఎస్ఆర్ సర్కిల్: చేతివృత్తిదారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చేతివృత్తిదారుల సమస్యలపై గ్రామాల్లో సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ చేతివృత్తిదారుల సంఘం నాయకులు శివ, సుబ్బారావు, లక్ష్మయ్య, గంప సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉన్నతితోనే ఉపాధ్యాయుడికి సంతోషం



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

కమలాపురం : విద్యార్థి ఉన్నతిని తన విజయంగా గర్వించే ఏకైక వ్యక్తి ఉపాధ్యాయుడు అని రిటైర్డ్ ఎంఈఓ సుబ్బరాయుడు, రిటైర్డ్ ఉపాధ్యాయులు తిరుపాలయ్య, అయ్యవారమ్మ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్ ఆవరణలో 1998–99 ఎస్ఎస్‌సీ బ్యాచ్ అపూర్వ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 24 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో కలసి సరదాగా గడిపి వారిని సత్కరించారు. మీరు తమకు విద్యా బుద్ధులు నేర్పారని, తామంతా మీ అడుగు జాడల్లో నడవడం వల్లనే ఈ స్థాయిలో స్థిర పడ్డామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ తాము వృత్తి ధర్మాన్ని పాటించామని, 24 ఏళ్ల తర్వాత మీరంతా మమ్మల్ని గుర్తు పెట్టుకుని ఒకే వేదికపై చేర్చడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.